కలగా ఫిష్ మార్కెట్

- 20 ఏళ్లుగా నెరవేరని హామీ
- నెలకు రూ.కోటి వ్యాపారం
- అసౌకర్యాల నడుమ చేపల విక్రయాలు



చికెన్ దుకాణాల వద్ద చేపల విక్రయం



ప్రైయివేట్ మార్కెట్లో టాయిలెట్ల ముందు చేపల విక్రయం

తగరపువలస: భీమిలి నియోజకవర్గంలోని ప్రధాన కేంద్రమైన తగరపువలసలో ప్రత్యేక ఫిష్ మార్కెట్ 20 ఏళ్లగా కలగా మిగిలిపోయింది. 2004 నుంచి పలుమార్లు మత్స్యశాఖ ఇక్కడకు సమీపంలో సంగివలస, బంగ్లామెట్ట ప్రాంతాలలో ఫిష్‌మార్కెట్ ఏర్పాటుకు స్థల పరిశీలనలతోనే సరిపుచ్చుతోంది. దీంతో విధిలేని పరిస్థితులలో స్థానిక ప్రయివేట్ మార్కెట్‌లోనే అసౌకర్యాల నడుమ, అపరిశుభ్రమైన వాతావరణంలోనే మత్స్యకార మహిళలు చేపల విక్రయాలు సాగిస్తుంటారు. భీమిలితో పాటు పక్కనే ఉన్న భోగాపురం తీరం, విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి మత్స్యకారులు, తగరపువలస కేంద్రంగా ఐదు మండలాలలోని వందలాది చెరువులలో సంప్రదాయ మత్స్యకారులు సాగుచేసే చేపలను ప్రయివేట్ మార్కెట్‌కు తరలించి విక్రయాలు జరుపుతారు. ఇక్కడి మార్కెట్‌లో సముద్రజాతులైన జెల్ల, కోనం, కానగడతలు, ఇసుక దొంతలు, నెత్తళ్లు, సావడలు, చందువాలు, వంజరాలు, శీలావతి, బొంతలు, పారలు, సొరలు, వాలుగ, బొచ్చు, కవ్వాళ్లు, కోల, గులిగింతలు, పండుగప్ప, రొయ్యలు, పీతలు, టేకుతో పాటు చెరువులు, నదులలో లభించే కొరమీను, బొమ్మిడాలు, బొచ్చె, రాంగడి, ఎర్రమైల, గడ్డిచేప, ఎర్రమైల, బంగారుపాప వంటి చేపలు నిత్యం అందుబాటులో ఉంటాయి.

నెలకు రూ.కోటికి పైగా వ్యాపారం..

స్థానిక ప్రయివేట్ మార్కెట్‌లో ప్రతిరోజూ కనీసం టన్ను చేపలు విక్రయాలు జరుగుతాయి. వినియోగదారులు నేరుగా కొనుగోలు చేసినవి కాకుండా ఫిషింగ్ హార్బర్, చెరువుల నుంచి తీసుకువచ్చిన చేపలను హోల్‌సేల్ వ్యాపారులు చిల్లర వ్యాపారులకు విక్రయించగా వీళ్లు గ్రామాలు, వీధులలో తిరిగి విక్రయిస్తుంటారు. మంగళ, బుధవారాలలో 3 టన్నుల వరకు, ఆదివారం 5 టన్నుల వరకు చేపలు, రొయ్యలు విక్రయిస్తారు. దీంతో నెలలో రూ.కోటికి పైగా చేపల వ్యాపారం ఈ మార్కెట్‌లో సాగుతోంది. ఇంత వ్యాపారం జరుగుతున్నా చేపల మార్కెట్ చుట్టూ వాతావరణం అపరిశుభ్రంగానే ఉంటుంది. టాయిలెట్ల నుంచి దుర్గంధం, వ్యర్థాలు వెలువడిన చోటే వినియోగదారులు చేపలు శుభ్రం చేయిస్తుంటారు. చేపల వ్యర్థాలు సకాలంలో తొలగించని కారణంగా ఇక్కడ బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. దీంతో ఈ అపరిశుభ్రత వాతావరణం నుంచి విముక్తి కలిగించి ప్రత్యేకంగా వసతులతో ఫిషింగ్ మార్కెట్ నిర్మించాలని కోరుతున్నారు.



అపరిశుభ్ర వాతావరణంలోనే చేపల విక్రయం, బాక్సులతో చేపల నిల్వలు

వర్షం పడితే మార్కెట్‌లో అడుగుపెట్టలేం



వర్షం పడితే ప్రయివేట్ మార్కెట్ లోపల చేపల కొనుగోలుకు అడుగు పెట్టలేం. ప్రభుత్వమే రైతు బజారును నిర్మించినట్టు చేపలకు ప్రత్యేకంగా వసతులతో మార్కెట్ ఏర్పాటు చేయాలి.

–నీలాపు రామిరెడ్డి, చిట్టివలస

హామీ నెరవేర్చలేదు



ప్రస్తుతం రైతుబజారు నిర్మించిన ప్రాంతాన్ని ఆనుకుని పాత వుడా వాణిజ్యసముదాయంలో ఫిష్ మార్కెట్ ఏర్పాటు చేస్తామన్నారు. కనీసం ఖాళీప్రదేశం ఇచ్చినా షెడ్లు ఏర్పాటు చేసుకుని విక్రయించుకోవడానికి వీలుగా ఉంటుంది.

–సింగిడి గణేష్, స్వదేశీ మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు

వాడవాడలా అన్నదానం

పద్మనాభం: వినాయక ఉత్సవాల్లో భాగంగా మండలంలోని మద్దిలో జట్లమ్మ ఆలయం వద్ద నిలిపిన వినాయక విగ్రహం దగ్గర శనివారం అన్నదానం నిర్వహించారు. అన్నదానాన్ని ఎంపీపీ కంటుబోతు రాంబాబు ప్రారంభించారు. సుమారు 2500 మందికి అన్నదానం చేశారు. మద్ది, తుని పాలెం గ్రామాలకు చెందిన భక్తులు ఈ అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

చంద్రంపాలెంలో..

మధురవాడ: సిద్ధివినాయక మహోత్సవాలను పురస్కరించుకుని చంద్రంపాలెంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. సుమారు 6వేలు మంది భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా స్వామికి విశేషంగా పూజలు నిర్వహించారు. ఆదివారం ఉత్సవ విగ్రహాలు ఊరేగించి అనంతరం మండపం వద్దే శుద్ధ జలాలతో నిమజ్జనం నిర్వహిస్తామన్నారు. అలాగే మిధిలాపురి వుడా కాలనీ బాలాజీ హిల్స్‌పై వెలసిన ఆలయంలో శ్రీ సిద్ధి వినాయక చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం అన్న సమారాధన నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు చెప్పారు.



ఆహార పదార్థాలు వడ్డిస్తున్న కమిటీ సభ్యులు

అధికారులు ప్రజాసమస్యలపై బాధ్యత వహించాలి

తగరపువలస: అధికారులు ప్రజాసమస్యలపై బాధ్యత వహించి సకాలంలో స్పందించాలని ఆనందపురం తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్ అన్నారు. శనివారం ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంక ఆధ్వర్యంలో జరిగిన మండల సాధారణ సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రజలు తనను నేరుగా సంప్రదించవచ్చన్నారు. ఎంపీపీ శారదా ప్రియాంక మాట్లాడుతూ అధికారులు సకాలంలో అభివృద్ధి పనులు పూర్తి చేసి ప్రజలకు అండగా నిలవాలన్నారు. ఆనందపురం విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ సురేష్‌కుమార్ ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం ద్వారా సబ్సిడీపై అందించే సోలార్ రూఫ్‌టాప్ గురించి తెలియజేశారు. పీహెచ్‌సీ ప్రధానవైద్యుడు జి.గంగునాయుడు మాట్లాడుతూ ఆస్పత్రి ఓపీని దృష్టిలో పెట్టుకుని సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేయాలని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. మండలంలో బీటీరోడ్లు, సీసీరోడ్ల నిర్మాణానికి భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు ప్రతిపాదనలు అందించినట్టు ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. మండలంలో జలజీవన్ పనులకు సంబంధించి 37 వర్కులు పూర్తికాగా 59 జరుగుతున్నాయని, కాంట్రాక్టర్లు రాకపోవడంతో మరో 58 వర్కులు నిలిచిపోయాయన్నారు. 18 పంచాయతీలలో జరుగుతున్న ఉపాధి హామీ పనులు, 50 ఎకరాలలో ఉద్యానవన పంటల గురించి సంబంధిత అధికారులు వివరించారు. ముచ్చర్ల, బోని, శిర్లపాలెం పంచాయితీలలో అన్ సెటిల్‌మెంట్ గ్రామాల రైతులకు భూహక్కులు కల్పించాలని ఆయ ప్రజాప్రతినిధులు కోరారు. ఆనందపురంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు ప్రత్యేకంగా వసతులు ఏర్పాటు చేయాలన్నారు. రైతుబజారు నిర్మించాలని కోరారు. లొడగలవానిపాలెంలో రక్షిత మంచి నీటి పథకాలకు మరమ్మతులు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు , సీసీరోడ్ల గురించి సర్పంచ్ లొడగల రాజేశ్వరి వినతిపత్రం అందించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, వైఎస్ ఎంపీపీలు బొట్ట ధనలక్ష్మి, పాండ్రంగి శ్రీను, ఎంపీడీవో లవరాజు తదితరులు పాల్గొన్నారు.



ఆనందపురం మండల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్

పేషెంట్ సేఫ్టీపై వర్కుషాపు

తగరపువలస: 4వ జాతీయ ఫార్మా కోవిజిలెన్స్ వారోత్సవాలలో భాగంగా శనివారం చెరకుపల్లి అవంతి ఫార్మసీ కళాశాలలో పేషెంట్ సేఫ్టీ అనే అంశంపై వర్కుషాపు నిర్వహించారు. ఆంధ్ర మెడికల్ కళాశాల విభాగాధిపతి డాక్టర్ డి.శ్యామల ఔషధ భద్రత, పర్యవేక్షణ గురించి వివరించారు.అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.చిత్ర మాట్లాడుతూ క్లినికల్ ఫార్మసిస్ట్ గొప్పతనం, ఔషధ ప్రతిచర్యల నివారణ ప్రాముఖ్యతను వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంబీవీ రాజు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఉమాశంకర్, వివిధ విభాగాధిపతులు బి.మనోజ్‌కుమార్, ఎం.పావని తదితరులు పాల్గొన్నారు.



వర్కుషాపులో పాల్గొన్న ఏయూ మెడికల్ కళాశాల విభాగాధిపతి శ్యామల

ప్రేమ పేరుతో వంచించిన వ్యక్తిపై కేసు

పీఎం పాలెం: ప్రేమ పేరుతో యువతిని లొంగదీసుకుని పెళ్లికి నిరాకరించిన వ్యక్తిపై పీఎంపాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం నగరంలో తాటిచెట్లపాలెంకు చెందిన యువతిని భీమిలికి చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తి 2017వ సంవత్సరం నుంచి ప్రేమిస్తూ లైంగిక దాడికి పాల్పడుతున్నాడు. పెళ్లి చేసుకోవాల్సిందిగా ఆమె కోరడంతో అందుకు నిరాకరించాడు. దీంతో మోసపోయాయని గ్రహించిన ఆమె శనివారం పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

దాడిచేసిన ఇద్దరిపై కేసు

పీఎం పాలెం: ఓ వ్యక్తిపై దాడిచేసి తీవ్రంగా గాయ పరిచిన ఇద్దరిపై పీఎం పాలెంపోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్టేషన్ పరిధిలోని బోయిపాలెం జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో నూతిగట్టు వీరబాబు కుటుంబంతో నివసిస్తున్నాడు. అదే కాలనీలో కోడూరు జ్యోతికి రూ.1500 చేబదులుగా ఇచ్చాడు. తాను ఇచ్చిన సొమ్ము తరిగి ఇవ్వాల్సిందిగా ఆమె సెల్‌కు మెసేజీ పెట్టాడు. ఆ మెసేజీ చూసిన జ్యోతి భర్తకు కోపం తెప్పించింది. ఇంటికి వస్తే డబ్బు ఇస్తానని తిరిగి మెసేజీ పెట్టాడు. డబ్బులు తీసుకుందామని వెళ్లిన వీరబాబుపై ఆమె భర్త రాము, రవి దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

కాంట్రాక్ట్ వర్కర్ల సమ్మె నోటీసు



ఫణికుమార్‌కు సమ్మె నోటీసు అందిస్తున్న కాంట్రాక్ట్ వర్కర్ల సంఘ ప్రతినిధి భవాని

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ వర్కర్లు సమ్మెకు సిద్ధపడుతున్నారు. సమస్యలు పరిష్కరించకపోవడంతో ఈ నెల 30వ తేదీ తరువాత సమ్మె చేయనున్నట్టు కాంట్రాక్ట్ వర్కర్‌ల సంఘ ప్రతినిధి భవాని స్పష్టం చేశారు. ఈమేరకు ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ ఫణికుమార్‌కు శనివారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కనీస వేతనాలు ఇవ్వడం లేదని, అవి కూడా సకాలంలో అందడంలేదన్నారు. అనంతరం ఆస్పత్రి వద్ద ధర్నా నిర్వహించారు. నూకరాజు, ఎల్లాజి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్



సంతపేటలో ఫాగింగ్ చేస్తున్న పారిశుధ్య సిబ్బంది

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ 1,2 వార్డులలో దోమల నివారణకు పారిశుధ్య సిబ్బంది శనివారం సాయంత్రం వీధులలో ఫాగింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా సిబ్బంది ఇంటింటా అవగాహన కార్యక్రమం చేపడుతూ ఇంటి పరిసరాలను పొడిగా ఉంచుకోవాలన్నారు. దోమల సంతతికి దోహదపడే ఖాళీ కొబ్బరిబోండాలు, పాత టైర్లు పరిసరాలలో లేకుండా చూడాలన్నారు.

బీజేపీ జిల్లా ధార్మిక సెల్ కో కన్వీనర్‌గా రమేష్

పీఎంపాలెం: భారతీయ జనతా పార్టీ జిల్లా ధార్మిక సెల్ కో కన్వీనర్‌గా పీఎం పాలెంకు చెందిన పట్నాల రమేష్‌ను ఆ పార్టీ నియమించింది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర ఈ మేరకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ పార్టీ అప్పగించిన బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వహిస్తానన్నారు.

మందుబాబుకు మూడు రోజుల జైలు

పీఎంపాలెం: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిని వ్యక్తికి న్యాయ స్థానం మూడు రోజులు జైలు శిక్ష విధించిందని ఎస్‌ఐ ప్రసాద్ తెలిపారు. కే1 కాలనీకి చెందిన వి.పైడిరాజు మద్యం సేవించి బైక్ మీద వెళ్తూ చిక్కాడని, అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయస్థానం మూడు రోజులు శిక్ష విధించిందన్నారు.

పోటీలకు ఆహ్వానం

తగరపువలస: హిందీ పక్షోత్సవాలలో భాగంగా 6వ తరగతి నుంచి పీజీ విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖనం, పద్యపఠన, దేశభక్తి గీతాలు, వేషధారణ పోటీలు నిర్వహించనున్నట్టు భీమిలి ఆదర్శప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు. ఈ నెల 29 వరకు నిర్వహించనున్న పక్షోత్సవాలలో భాగంగా ఈ పోటీలలో పాల్గొనడానికి ఉమ్మడి విశాఖ జిల్లాలో విద్యార్థులంతా అర్హులేనన్నారు. పోటీలకు అవసరమైన స్టేషనరీ తామే ఇస్తామన్నారు. వివరాలకు 89856 47419, 89858 97419 నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఈ పోటీల్లో ఉత్సాహవంతులు ఎక్కుమంది పాల్గోవాలని కోరారు.

పెండింగ్ కేసులు తక్షణం పరిష్కరించండి



మాట్లాడుతున్న పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి

పీఎంపాలెం : పెండింగ్ కేసులు తక్షణం పరిష్కరించాలని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశించారు. శనివారం రాత్రి ఆయన పీఎంపాలెం పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. వివిధ కేసులు ఇంకా దర్యాప్తు చేయకపోవడానికి గల కారణాలపై వివరణ తీసుకున్నారు. చోరీలకు పాల్పడిన నిందితులను అరెస్టు చేయడంలో జరిగిన జాప్యాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని చెప్పారు. పాత నేరస్తులపై మరింత నిఘా పెట్టాలని పోలీసులను ఆదేశించారు. శివారు ప్రాంతాల్లో నేరాలు అరికట్టేందుకు లైటింగ్ ఏర్పాటుతో పాటు అవసరమైన చోట్ల సీసీ కెమెరాలను అమర్చాలని సూచించారు. నేరాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి సిబ్బందితో నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. అనంతరం పోలీసు స్టేషన్ రికార్డులను ఆయన తనిఖీ చేశారు.

పనులు సకాలంలో పూర్తి చేయాలి

భీమునిపట్నం: భీమిలి మండల పరిధిలో ఆయా పంచాయతీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని ఎంపీపీ దంతులూరి వాసురాజు అధికారులను ఆదేశించారు. శనివారం జరిగిన మండల ప్రజా పరిషత్ సమావేశంలో పాల్గొన్నారు. పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. ఆయా ప్రాంతాల్లో నెలకున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు.ప్రయివేటు పాఠశాలల నిర్వహణ, స్కూల్ బస్సుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని విద్యాశాఖ అధికారి శివరాణికి సూచించారు. మూడు రోజుల క్రితం ఓ చిన్నారి స్కూల్ బస్సు ఢీకొని చనిపోవడం ఎంతో బాధాకరమన్నారు. బస్సుల కండీషన్‌పై సరిగా లేకపోతే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఏఈ పట్నాయక్ మాట్లాడుతూ మండలంలో ఉపాధి హామీ పథకం కింద రూ. 5.98 కోట్లతో 21 పనులను చేయడానికి ప్రతిపాదనలు రూపొందించామని తెలిపారు. కౌలు రైతులకు రుణాలతోపాటు ఇతర సదుపాయాలు పొందడానికి అవసరమైన కార్డులను 150 మందికి అందించినట్టు మండల వ్యవసాయ శాఖ అధికారి శివకోమని తెలిపారు. వైస్ ఎంపీపీ బోని బంగారు నాయుడు, జెడ్పీటీసీ గాడు వెంకటప్పడు, ఎంపీడీవో జానకి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ వాసురాజు

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు జెడ్పీ విద్యార్థులు

తగరపువలస: భీమిలి మండలం లక్ష్మీపురం జెడ్పీహైస్కూల్ విద్యార్థులు కరుభుక్త శ్రావ్య, బుత్తల సునీత, బోని కిరణ్ త్వరలో గుంటూరులో జరగనున్న స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. నగరంలో జరిగిన జల్లాస్థాయి పోటీలలో వీరు ఎంపికైనట్టు ఫిజికల్ డైరెక్టర్ ఎస్.లలిత్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు గాడు పైడిరాజు అభినందించారు.



కరుభుక్త శ్రావ్య బుత్తల సునీత బోని కిరణ్

ఫుట్‌పాత్‌పై బండరాళ్లు

కొమ్మాది: రుషికొండ బీచ్‌రోడ్డు ఆనుకుని కమర్షియల్ నిర్మాణాలు అనధికారికంగా నిర్మిస్తున్నారు. వీటికోసం ఉపయోగిస్తున్న బండరాళ్లను ఫుట్‌పాత్‌పై వదిలివేయడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు శనివారం జోనల్ కమిషనర్ సింహాచలంకు ఫిర్యాదు చేశారు. అదే విధంగా పెద రుషికండ ఎస్‌బీఐ వద్ద ఓ వ్యక్తి రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంపై ఫిర్యాదు చేశారు. వార్డులో చిన్న రుషికొండ, పెదరుషికొండ, ఎండాడ, సుభాషిత్‌నగర్ ప్రాంతాల్లో అనధికార నిర్మాణాలు విచ్చలవిడిగా జరుగుతున్నా పట్టణ ప్రణాళిక విభాగం నిద్రమత్తులో తేలుతోంది. ఇప్పటికైనా అనధికారిక నిర్మాణాలపై దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు.



ఫుట్‌పాత్‌పై తొలగించని బండరాళ్లు

భోజనం నాణ్యతలో రాజీ వద్దు

మధురవాడ: మధ్యాహ్న భోజనం నాణ్యతలో ఎట్టి రాజీ వద్దని, రుచి, శుభ్రంగా ఉండాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్. చంద్రకళ అన్నారు. శనివారం మధురవాడ గణేష్‌నగర్ వద్ద ఉన్న ఎపీపీ స్కూల్‌లో భోజనం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడి పలు అంశాలు పరిశీలించారు. అలాగే ఇక్కడ పరిసరాలు, మరుగు దొడ్ల నిర్వహణ తదితర అంశాలు కూడా పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఏపీసీ శ్రీనివాసరావు, ఎమ్ఈవోలు రవీంద్రబాబు, అనురాధ, ప్రధానోపాధ్యాయుడు గంట్యాడ ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.



గణేష్‌నగర్ స్కూల్ మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న డీఈవో చంద్రకళ

కనీస వేతనాలు అమలు చేయాలి

మధురవాడ: జీవీఎంసీలో మంచి నీటి సరఫరా, ఇంజినీరింగ్ సెక్షన్‌లలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయాలని శనివారం కార్పొరేటర్లకు వినతి పత్రాలు అందజేశారు. 7వ వార్డు కార్పొరేటర్ మంగమ్మ, 5వ వార్డు కార్పొరేటర్ హేమలత ఇంటికి వెళ్లి సమస్యలు వివరించారు. తమకు ఇచ్చే రూ.13వేలుతో జీవనోపాధి కష్టంగా మారిందన్నారు. కనీసం తమకు ప్రభుత్వ పథకాలు కూడా అమలు కావడం లేదన్నారు. జీవీఎంసీలో కాంట్రాక్ట్ కార్మికులకు తమ కంటే అదనంగా 40శాతం ఎక్కువ వేతనం ఇస్తున్నా తమకు మాత్రం వర్తింపజేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కౌన్సిల్ తీర్మానం ప్రకారం అన్ స్కిల్డ్ వారికి రూ. 25,140, సెమీస్కిల్డ్ వారికి రూ. 29,610, వేతనాలు చెల్లించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ కాంట్రాక్ట్ , ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. దుర్గాప్రసాద్, వైస్ ప్రెసిడెంట్‌లు చిన్నారావు, రవి, జాయింట్ సెక్రటరీలు సతీష్, శ్రీను వాసు, బాస్కర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేటర్ మంగమ్మకు వినతి పత్రం అందజేస్తున్న తాగునీటి సరఫరా, ఇంజినీరింగ్ విభాగం ఉద్యోగులు

విద్యార్థులకు ఆటల పోటీలు

తగరపువలస: స్వచ్ఛభారత్ మిషన్ కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆటలపోటీలు నిర్వహించారు. అలాగే ప్రజాకవి గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా ఆయన గురించి విద్యార్థులకు వివరిస్తూ తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప సాహితీకారునిగా తెలియచేశారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ షేక్ షర్మిల, ఉపాధ్యాయురాలు బుగత మల్లిక పాల్గొన్నారు.

క్లుప్తంగా

పారిశుధ్య సిబ్బందికి సహకరించాలి



సత్యనారాయణమెట్టలో ర్యాలీ నిర్వహిస్తున్న జెడ్సీ ప్రేమ ప్రసన్నవాణి తదితరులు

తగరపువలస: ప్రతి ఒక్కరు పారిశుధ్య సిబ్బందితో సహకరించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జీవీఎంసీ భీమిలి జెడ్సీ పి.ప్రేమ ప్రసన్నవాణి కోరారు. శనివారం భీమిలి జోన్ రెండోవార్డు సత్యనారాయణపేటలో స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా పరిసరాలను శుభ్రం చేశారు. ప్రతి ఒక్కరు క్లాప్ వాహనాలతో వచ్చే సిబ్బందికి తడి,పొడి చెత్తను వేరు చేసి అందించాలన్నారు. చెత్తను రోడ్ల పక్క, డ్రైనేజీలలో వేయవద్దన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గాడు చిన్నికుమారి లక్ష్మి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.మహలక్ష్మినాయుడు, డ్వాక్రా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

బేస్‌లైన్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

పద్మనాభం: పాఠశాలల్లో ఈ నెల 27, 28 తేదీల్లో బేస్ లైన్ పరీక్షలను నిర్వహించాలని భీమునిపట్నం డైట్ లెక్చరర్ ఎస్.త్రినాథరావు అన్నారు. మండలంలోని ఆర్‌వీపురం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా త్రినాథరావు ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధత చేయడంపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం కె.కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీవీస్ ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న దివీస్ ఉద్యోగులు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబరేటరీ ఉద్యోగులు శనివారం స్వచ్ఛత హీ సేవ ర్యాలీ నిర్వహించారు. సంస్థ డైరెక్టర్ ఎస్.దేవేందర్‌రావు, వైస్ ప్రెసిడెంట్ ఎల్.వి.రమణ మాట్లాడుతూ ప్రతిపౌరుడు పరిశుభ్రతను అలవాటుగా మార్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్లు వైఎస్ కోటేశ్వరరావు, ఇ. రామకృష్ణ, సీనియర్ మేనేజర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గురజాడ సేవలు మరువలేనివి



గురజాడకు నివాళులర్పిస్తున్న డైట్ అధ్యాపకులు

భీమునిపట్నం: తెలుగు భాష అభ్యుదయానికి గురజాడ అప్పారావు చేసిన సేవలు మరువలేనివని జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్) ప్రిన్సిపాల్ ఎం.జ్యోతికుమారి అన్నారు. శనివారం నిర్వహించిన గురజాడ జయంతి కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు వ్యవహారిక భాషను అభివృద్ధి చేయడానికి ఆయన విశేష కృషి చేశారన్నారు.కార్యక్రమంలో అధ్యాపకులు మాణిక్యంనాయుడు, సుధాకర్, నాగేశ్వరరావు, నీలిమ, రవి పాల్గొన్నారు.

పోలీసు అధికారులతో భేటీ

మధురవాడ: ఇటీవల బాధ్యతలు చేపట్టిన విశాఖ నార్త్ జోన్ ఏసీపీ అప్పలరాజు, సీఐ బాలకృష్ణలను ఏపీ నగరాలు కార్పొరేషన్ మాజీ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు ఆత్మీయంగా కలిశారు. వారికి పూల మొక్కలు అందజేసి, సత్కరించారు.



ఏసీపీకి మొక్క అందజేస్తున్న శ్రీనివాసరావు